# పాపం, అమాయకురాలు!

**మా** పున్నయ్య మామను చూస్తే నాకు చాలా అపేక్షే! కాని ఆయన ఆ మాటన్నప్పుడల్లా నాకు వళ్ళు మండుకొచ్చేది. ఇంకా ఆయన మాటలంతా నమ్ముతున్నారనే ఆయన ధైర్యం! అందరి కళ్ళల్లో తాను కారం చల్లుతున్నాడనే ఆయన నమ్మకం! పదిహేను సంవత్సరాల కింద మా కామమ్మత్త – "కామ్మత్త" అనే వాళ్లం మేం; "గయ్యాళి కామమ్మ" అనేవారు ఊళ్ళోవారు! – ఆమె కాపరానికి వచ్చిన కొత్తలో భర్తమీద సవారి చెయ్యటం ప్రారంభించినప్పుడు, నా బోటి గాడెవడో పక్క నుండి "ఇదేమిటి, మామా?" అంటే, ఆయన చాలా నిర్లక్ష్యంగా "పోనీరా? దానితోనేమిటి? అమాయకురాలు!" అని ఏమన్నాడో మేమేమ్మన్నామో, అదంతా జరిగిపోయింది. పదిహేను సంవత్సరాలు జరిగిపోయింది. ఇప్పుడింకా మమ్మల్ని ఆ విధంగా మోసపుచ్చాలనుకోవటం ఏమిటి? తెలీకడుగుతాను! మమ్మల్ని వెధవలు చెయ్యాలని ఉద్దేశమా? మా మామను ఈ ముక్కలు మూడూ స్పష్టంగా అడిగాను.

"కాదే, మామా! నువ్వేమో నిన్న ఆఫీసుకు అన్నం తినకుండా పోతివి. రాత్రి ఏడు గంటలకు కాని తిండి లేకపోయె. ఆవిడేమన్నా చింతించనన్నా చింతించిందా? ఇన్ని సంవత్సరాలు వచ్చి నిన్నామె సవతికొడుకును చూసినట్టు చూడటం ఏమిటి? నీ అసమర్థత కాదూ? ఎవరైనా వింటే నవ్విపోతారు. నిష్కారణంగా ఆమెను చెడగొట్టావు!"

మా మామకు అమిత ఓర్పు. ఆయనతో మాట్లాడుతున్నప్పుడు నా ఓర్పు కూడా తీసుకుంటున్నాడా అనిపించేది నాకు. ఆయన ఓర్పు చూస్తే నా ఓర్పంతా నశించి ఒళ్లు కంపరం ఎత్తేది.

"చూడు, రాముడూ! నిజంగా అది పాపం, ఉత్త అమాయకురాలురా?"

"చాల్లే! నువ్వు అమాయకుడివి! ఎవడైనా ఒక్కడు కాదంటే తల గొరిగించుకుని గాడిదమీద ఊరేగుతాను. నిజం చెబుతున్నాను. ఆవిడ నోటికి వెరిచి, మాకీ పిచ్చి సమాధానాలు చెబుతావు. నేను కనుక్కోలేనీ మాత్రం?"

"పోనీ, అదే అనుకో!" అనేవాడు మా పున్నయ్య మామ నవ్వుతూ. అటువంటి మనిషితో ఏమిటి చెయ్యడం? పైగా ఆయనేదో చెప్పబోతుండగా నేను అడ్డం వచ్చాను. అదేదో తెలుసుకునే అవకాశం లేదిప్పుడు.

"మరయితే నిజమైన కారణం చెప్పు!" అన్నాను ఆయన్ను బయటికి లాగటానికి.

"నువ్వు చెప్పిందే నిజం!" అన్నాడాయన చలించకుండా.

"నేను చెప్పిందబద్ధమైతే నువ్వు నిజం చెప్పు."

"నువ్వు చెప్పిందబద్ధం కాదు."

"అవునని లోపల అనుకుంటూ కాదంటే ఏం ప్రయోజనం?"

"నువ్వు నా మాట నమ్మకపోతే ఏం చెయ్యను?"

"ఏమిటి? చెప్పు నీమాట!"

"అంతా విని అబద్ధం అంటావు."

"అన్ను!"

"నిజంగా పాపం దానికి తెలీదు, దాని చర్యవల్ల నేను కష్టపడుతున్నానని. నాకు కోపం వస్తే అది గడగడలాడుతుంది. అందుచేత నేను శాంతం అవలంబించవలసి వచ్చింది."

నేను బిగ్గరగా నవ్వాను. మా మామకు కోపం రాలేదు!

"నువ్వు సాయంత్రం దాకా తిండి లేకుండా ఉంటే నీకు కష్టమని ఆవిడకు తెలీదు కదూ?" అన్నాను ఎగతాళిగా.

"నేను కష్టంలేనట్టు నటిస్తాను."

"ఎందుకు?"

"దాని మనస్సు శాంతిగా ఉండటానికి."

"తిరిగి ఇంకోసారి అటువంటిపని నిరభ్యంతరంగా చెయ్యటానికీ! నీకు కోపం వస్తే ఆవిడ భయపడ్డం! నేను చూడ్డం! ఇంతవరకెప్పుడన్నా వచ్చిందా కోపం!"

"ఆ! ఒకటిరెండుసార్లు!" అన్నాడు మా మామ గడ్డం నిమురుకుంటూ.

"నేనెన్నడూ చూడలేదు."

"చూసినా నువ్వు కనుక్కోలేవు!" అన్నాడాయన నవ్వుతూ.

ఆయన ఎదట నేను ఓడినట్టు ఒక్క వీసమైనా కనపడటం నాకిష్టం లేదు. కాని ఆయన చెప్పిన మాటలు ఒకటి రెండు యదార్థమే. మొదటి విషయం మా "కామ్మత్త" గయ్యాళి కాకపోతే చాలా మంచిదే. కాని ఆ ఒక్క కళంకమే ఆమెను గ్రహణం పట్టినట్టు ఆమె ఇతర గుణాలు బయటికి రాకుండా చేసింది. ఆవిడకు మాట తొందరపడి అనటం, నోటిదుడుకు జాస్తి. ఏ మాత్రం లోకజ్ఞానం లేదు. ఇంకొకరి విషయం విచారించటం మొదలేలేదు. అందరూ తన్ను ఎదటనే గయ్యాళి కామమ్మని పిలుస్తుంటే పెద్ద బిరుదనుకుని సంతోషించేది. నలుగురమ్మలక్కలు ఆవిడచేత చాకిరీ చేయించుకోడానికి ఆమెను అభినందించేవారు. మొగుణ్ణి ఏడిపిస్తున్నందుకు అవిడా మాటలన్నీ నమ్మేది!

ఆవిణ్ణంతా మగవాడి కిందనే చూసేవారు. ఆడవాళ్ళతో మాట్లాడ్డానికి బిడియం ఉన్న వారు కూడా ఆమెతో స్వేచ్ఛగా మాట్లాడేవారు. ఆవిడకు పిల్లలు పుట్టకపోవటం ఎవ్వరికీ ఆశ్చర్యకరంగా తోచలేదనుకుంటాను. నాకూ తోచలేదు! ఎటొచ్చీ మా మామ ఒక్కడే ఆవిణ్ణి పువ్వుల్లో పెట్టి పూజించినవాడు!

ప్రస్తుతం మన సంఘంలో స్త్రీకి విద్యాభ్యాసానికి ఎక్కువ అవకాశం లేదు. భర్త దగ్గిరికి వచ్చేసరికి కాస్త అటూ ఇటూగా మృగంవతుగా ఉంటుంది! అదంతా నేనెరుగుదును. అది అట్లా ఉంచండి. కాని కొంతకాలం కాపరం చేసిన తరవాతనన్నా మనిషి మానవ ప్రపంచంలో పడకపోతే ఆ తప్పు భర్తదే! లక్ష చెప్పండి! మా అత్త అంత నగుబాట్లమారిగా ఉండటం మామదే తప్పు!

మా మామ అన్ని విషయాల్లో చాలా తెలివి గలవాడు. ఈ ఒక్క విషయంలో అజ్ఞానాన పడ్డాడని నమ్మాను. సామాన్యంగా ఏ మనిషినైనా తీసుకోండి. విడిగా చూసి భార్య దగ్గిర ఎట్లా ఉండేది కనుక్కోలేం. ఎటువంటి వాడూ భార్య దగ్గిర మారిపోతాడు. లేకపోతే ఎన్నడైనా మా మామ అట్లా ప్రగల్భాలు పలికి ఎరుగునా? తనకు కోపం వస్తేట మా అత్తయ్య భయపడి పోతుందిట! ఆ కోపం నేను కనుక్కోలేనుట! ఎవడూ నోటితో నవ్వడు!

నా చదువు పూర్తి అయినప్పటినించీ నేను సంవత్సరానికి తొమ్మిదినెల్లు మా మామ దగ్గిరే ఉండేవాణ్ణి. మా అత్త ఎటువంటి ఛాందసం మనిషంటే, ప్రతివాడి మీదా ఒంటికాలితో లేచేమనిషి. నా నోరూ మంచిది కాకపోవటం వల్ల నాతో చాలా మంచిగా ఉండేది. అదే ఇటువంటి మనుషులతత్వం. వారిని లొంగతీయాలంటే నోటిదుడుకు చాలా అవసరం. నన్ను చూస్తే ఆవిడకు చాలా ఇష్టం కూడాను!

ఇట్లా ఉంటుండగా అయిదారునెల్ల కిందట మా మామయ్యకు పెంచుకుందామా అని ఆలోచన కలిగింది.

ఈ పెంపకం విషయంలో ఆయన అభిప్రాయాలు నేను ఆదర్శంగా తీసుకున్నాను. ఆయన అభిప్రాయాలేమిటంటే – పెంపకం వంశం నాశనం కాకుండా ఉంటుందనే అభిప్రాయంతో చేసుకోరాదు. పెంపుడు కొడుకు వెయ్యి పుతాలు వేసినా స్వంత కొడుకు కాడు! మనం ప్రాణంతో సమానంగా చూడగల పిల్లవాడు దొరికితేనే తెచ్చి పెంచుకోవాలి. ఆ పిల్లవాడికి మనమీద అపేక్ష ఉండటం ఆవశ్యకం. మగపిల్లవాడే కావాలని నియమంలేదు.

మా అత్త అభిప్రాయాలు వీటికి సరిగ్గా విరుద్ధం అనుకోండి!

మా మామ ఉన్న ఇంటికి కొద్ది దూరంలో ఒక రోగిష్టి బ్రాహ్మడుండే వాడు. ఆయన కొడుకొకడుండేవాట్ట. వాడు తండ్రి సంపాదించిన ఆస్తంతా పాడుచేసి తండ్రికి

మందు పెట్టి దేశాల మీద లేచిపోయాడు. ఆయనకు పన్నెండేళ్ల పిల్ల ఉండేది. చక్కనిచుక్క. ఎంతో బుద్ధిమంతురాలు. ఆ పిల్ల ఒక రోజు మా మామ దగ్గిరికివచ్చి వండుకోటానికి కాసిని బియ్యం పెట్టమని అడిగింది. ఆ బ్రాహ్మడూ ఆ పిల్లా ఆ ఊరు రావటం అదే కొత్త. నేనక్కడే ఉన్నాను. మా మామ ఆ పిల్లను చూసి ముచ్చటకలిగి ప్రశ్నలు వెయ్యటం మొదలు పెట్టాడు. ఆ చరిత్రంతా ఆ పిల్లనోట వింటుంటే నాకు గుండె నీరయింది. మా మామ ఆ పిల్లకు శేరు బియ్యం, ఉప్పు, మిరపకాయలూ మొదలైన సామగ్రి, కొంచెం చిల్లర డబ్బూ ఇచ్చి మళ్ళీ రమ్మన్నాడు మర్నాడు.

కొద్దికాలానికి ఆ బ్రాహ్మడు పోయినాడు. నేనూ మా మామా వెళ్ళి తగిన సహాయం చేశాం. మా మామ ఏడుస్తున్న ఆ పిల్లను చూపించి, "చూడరా, రాముడూ, అటువంటి పిల్లను దగ్గిరికి తీసి సంరక్షించే భాగ్యం అందరికీ లభిస్తుందా?" అన్నాడు. నేను మాట్లాడలేదు.

ఆ రాత్రే మామయ్య ఆ పిల్లను తన ఇంటికి తెచ్చాడు. ఆ పిల్ల పేరు నీలవేణి. మా మామనూ, ఆ పిల్లనూ చూసినప్పుడల్లా నేను వారిద్దరూ ఏ జన్మలోనో తండ్రీ కూతుళ్ళనుకునే వాణ్ణి.

నీలవేణిని మా అత్త అదివరకు ఎరుగును. మా మామ ఆ పిల్లను మా అత్తకు చూపి, "ఇప్పటినించీ ఈ అమ్మాయి మనింట్లోనే ఉంటుంది" అన్నాడు.

"ఏ-మి-టీ?" అన్నది గయ్యాళి కామమ్మగారు కళ్ళు పెద్దవి చేసి.

మా మామయ్య నవ్వుతూ "నీకు వినపడ్డది!" అన్నాడు.

"అవును. వినపడ్డది. అర్థం కాలేదు" అన్నది మా అత్త. అప్పటికామెకు బాగా పూనింది!

మా మామ తొణకలేదు. ఆయన ఎన్నడూ తొణికి ఎరగడు. "కావచ్చును. ఇక ముందర్థమౌతుంది" అన్నాడు.

ఏముంది? మామూలు సంభాషణే. అంతా అయిన తరవాత మా మామ భార్య మనస్సు నొచ్చి పోతుందేమోనని నీలవేణిని భగవంతుడి మీద పారేసి ఇంటికొస్తాడు. నాకు ముందే తెలుసును!

"ఆ పిల్లకు మైల. తాక్కండీ! ఏం పన్లు?" అన్నది మా అత్త మొహం కండలు ఊడబెరుక్కుంటూ.

మా మామ - ఇంకా నవ్వుతూనే ఉన్నాడు! నీలవేణిని దగ్గిరికి తీసుకుని తల నిమురుతూ, "మైలా లేదు గియిలా లేదు. నేనీ పిల్లను పెంచుకున్నాను. చాలా రోజులైంది" అన్నాడు. నీలవేణి దూరంగా ఉన్న నావంక ఒక్కసారి చూచి తలవంచుకున్నది.

మా అత్త ఆ మాట వినగానే మండిపడి "మీరు పెంచుకుంటే నేను పెంచుకోలేదు.

నేనీ బిచ్చగత్తెకు ఒక పూట వండిపెట్టను. కావాలంటే మీరే పెట్టుకోండి, చేసుకోండి" అని మా అత్తయ్య ఆగ్రహంతో వణుకుతూ వెనక్కు తిరిగింది.

మా మామయ్య ఇంకా నవ్వుతూనే "పోనీ నీకు ఇష్టమై మా ఇద్దరికీ భోజనం పెట్టేవరకూ నిన్ను బాధించం.... (నీలవేణితో) ఏమమ్మా! అంతే కాదూ?" ఆ పిల్ల వంచిన తల ఎత్తితే ఒట్టు!

ఆ రాత్రి మా మామయ్య పెంపుడు కుమార్తెతో సహా హోటల్లో భోంచేసి వచ్చాడు. నేనామాట చెప్పినప్పుడు మా అత్తయ్య రౌద్రమూర్తి అయిపోయి "ఏమన్నా ఏడుచుకోనీ!" అన్నది.

మర్నాడు మా మామ భార్యతో మామూలుగానే మాట్లాడుతూ వచ్చాడు. ఇంకా ఆవిడే ఆయనతో మాట్లాడలేదు. కాని భోజనం వేళకు తిరిగి ఇద్దరూ హోటలుకు పోయినారు. మా అత్త మా మామకొక్కడికీ బియ్యం పోసింది. కని పెట్టుక్కూర్చున్నది. నేను మళ్ళీ చెప్పేను హోటలుకు వెళ్ళారని.

"నిజమేనా?" అన్నదామె.

"నిజం నీ తోడు!"

"బెదిరిస్తారా?" ఆమె మాట్లాడకుండా భోంచేసింది.

ఇక ఆ మర్నాడు ఆమెలో గొప్ప మార్పు వచ్చింది. బయటికి కనిపించిన విశేషం ఏమిటంటే ఆ రోజామె మొహం పాలిపోయి ఉంది. అతివాగుడు తగ్గింది. అసలు వాక్కే పడిపోయిందని చెప్పవచ్చు. ఆ రోజు ఆమె వండిన అన్నం చూస్తే పిల్లక్కూడా పోసినట్టు కనపడ్డది. మా మామ భార్యతో మామూలుగా మాట్లాడటం మానలేదు. భోజనానికి మాత్రం హోటలుకు వెళ్ళాడు. ఆయన స్నానం చెయ్యక పూర్వం మా అత్త వచ్చి తొంగి చూసింది. స్నానం చెయ్యమనటానికేమో? కాని ఆయన అప్పుడే లేస్తున్నాడు స్నానానికి. అది చూసి ఆమె పీటవేసి విభూతీ, సంధ్య వార్చుకునే పళ్ళెం అవీ సిద్ధం చేసింది. మా మామ మాత్రం సరాసరి హోటలుకు వెళ్ళాడు.

ఆ మర్నాడల్లా ఆమె ఏడుస్తున్నట్టు నాకు స్పష్టం అయింది. ఆమెను చూస్తే నాకు చాలా జాలి కలిగింది. నేను ఒక్కటే అనుకున్నాను. అంతవరకూ ఆమె తన భర్త యొక్క స్వరూపం సొంతంగా చూడాలని ప్రయత్నించలేదు. కాపరానికి వచ్చిన కొంతకాలానికి ఆయనలో ఆమెకు నూతన శక్తి కనిపించింది. అంత దాకా వస్తే నాకూ అంతే. ఆయన్ను చూస్తే నాకే భయం వేసింది. ఆయన భార్య సంగతి గమనించినట్టు కనపడలేదు.

ఆ రాత్రి నేను ఆయన దగ్గిర కూర్చున్నాను.

"రాముడూ నీలవేణిని నువ్వు చేసుకోరా. ఇస్తాను" అన్నాడాయన సరదాగా. ఆ పిల్ల ఆయన ఒళ్ళోనే కూర్చుంది.

"సరే కాని, మామా! పాపం ఎందుకత్తయ్యను ఏడిపిస్తావు? పోయి సముదాయించు. నేను చూడలేకుండా ఉన్నాను" అన్నాను.

ఆయన చివాలున లేచి "పాపం! నాకు తెలీదుసుమా!" అని లోపలికి పరిగెత్తాడు.

అటువంటి మనిషితో ఏమిటి చెయ్యటం?

***మొదటి ముద్రణ : గృహలక్ష్మి, జూలై 1932***